వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 08 ఆగస్టు 2022

ఆదమరిస్తే ప్రమాదం కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

కురబలకోట మండలం అంగళ్ళు గ్రామం కమతంపల్లె వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేనందున ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులతో పాటు పశువులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చేతికందే ఎత్తులో ఈ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేయడంతో ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు కమతంపల్లె, చిన్నహరిజనవాడ, పెద్దహరిజనవాడ వ్యవసాయ బోర్ల వద్దకు కరెంటు సమస్యలపై అధికారులు అటువైపునే వెలుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగింతేవరకు స్పందించేలా అధికారులు లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సిఐ రుషికేశవును ఆదర్శంగా తీసుకోవాలి : ఎస్పీ

రుషికేశవ సతీమణికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ

మదనపల్లెక్రైం, ఆగస్టు 7 ప్రభాతవార్త :

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పనిచేసిన సిఐ రుషికేశవును పోలీసులు ఆదర్శంగా తీసుకొని ఉద్యోగ బాధ్యతలు నిక్కచ్చిగా వ్యవహరించాలని చిత్తూరుజిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. ఆదివారం మదనపల్లెలోని పంక్షన్‌హాలులో జరిగిన ఆత్మీయ సంస్కరణ సభకు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జీవితంలో నిజాయితీగా ప్రజల పక్షాన నిలబడి వారికి న్యాయం చేయడంలో అందరి మన్ననలు పొంది బాధితుల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ప్రకృతివనం నిర్వాహకులు ఎంసివి ప్రసాద్ మాట్లాడారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.33లక్షల చెక్కును ఎస్పి అందజేశారు. ఈ సమావేశంకు సిఐ రుషికేశవ ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో కలసి పనిచేసిన సిఐ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితోపాటు సతీమణి సుశీల, డిఎస్పి రవిమనోహరాచారి, స్థానిక సిఐలు ఈదూర్‌బాషా, సత్యనారాయణ, రామాంజనేయులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష

కడప కార్పొరేషన్, ఆగస్టు 7, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజల సంక్షేమమే.. రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 15వ డివిజన్ పరిధిలోని సరోజినిరే నగర్, రాజీవ్ గృహకల్ప కాలనీ, లక్ష్మీ నగర్, నిరంజన్ నగర్ ప్రాంతాల్లో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం ఎస్.బి. అంజాద్ బాషా ఆధ్వర్యంలో గ్రామోత్సవంలా సాగింది. ఈ సందర్భంగా.. ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలు, సేవలు పట్ల లబ్ధిదారుల మనోగతాన్ని తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారిని కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ది సమాచారంతో కూడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని.. ఉపముఖ్యమంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందడం.. జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందన్నారు. కరోనా లాంటి ప్రపంచ విపత్కర పరిస్థితుల్లో కూడా.. ప్రజలు ఏ మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో.. సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని ప్రశంసించారు. అమ్మఒడి, వైయస్సార్ పింఛన్ కానుక, వైయస్సార్ చేయూత వైయస్సార్ ఆసరా, వైయస్సార్ ఆరోగ్యశ్రీ, వాహనమిత్ర వైయస్సార్ వసతి దీవెన, వైయస్సార్ విద్య దీవెన, పేదలందరికీ ఇల్లు వంటి సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరిస్తూ... గడపగడపకు ఆయన పర్యటన సాగింది. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఒక్కరు కూడా.. సంక్షేమ పథకాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు వైకాపా నాయకులు మహమ్మద్ బాషా, అఫ్జల్ ఖాన్, మాసీమ బాబు, సోహైల్ బాషా, డిప్యూటీ కమిషనర్ రమణా రెడ్డి, 15 డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ దేవి, డివిజన్ ఇంచార్జి వీరారెడ్డి, రాజీవ్, ప్రసాద్, వివేకానంద, తేజ, వెంకటేష్, నజీర్, కృష్ణారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ఇతర నగర కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్ లు, డైరెక్టర్స్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి గిరిజనుల సమస్యలు

గిరిజనుల అభివృద్ధి కోసం పంజం నిత్యం కృషీవలుడు

కేంద్ర అభివృద్ధి సంక్షేమం బోర్డుమెంబర్ తురక నరసింహా

రామయ్యపాళెంలో గిరిజనులతో మాట్లాడుతున్న కేంద్ర అభివృద్ధి సంక్షేమం బోర్డుమెంబర్ తురక నరసింహా, పంజం సుకుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 7 ప్రభాతవార్త

రైల్వేకోడూరు నియోజకవర్గంలో గిరిజనులు ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, తాను నెల్లూరు, చిత్తూరు జిల్లాలు తిరిగానని, అన్నమయ్య జిల్లాలోని కుక్కలదొడ్డి, రామయ్యపాళెంలో గిరిజనుల అభివృద్ధి భేషుగ్గా ఉందని కేంద్ర అభివృద్ధి సంక్షేమ బోర్డుమెంబరు తురకా నరసింహా అన్నారు. ఆదివారం ఆయన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గ సరిహద్దు ప్రాంతమైన కుక్కలదొడ్డి, శెట్టిగుంట కొయ్యబొమ్మల తయారీ కేంద్రాలను అనంతరాజుపేట రామయ్యపాళెం గిరిజనులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడి దేశ ప్రజలకు చేస్తున్న సేవల్లో భాగంగా ముఖ్యంగా సుగాలి, లంబాడి, యానాది కులాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో 40 వేల కోట్ల రూపాయలు నిధులను ఏర్పాటు చేశారని అన్నారు. ముఖ్యంగా 75 సంవత్సరాలు పరిపాలించిన ప్రతిపక్ష పార్టీలు ఏనాడు గిరిజనులపై ప్రత్యేక అభివృద్ధిని చేపట్టలేదని, ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోడి దేశంలోని గిరిజనుల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడ గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం ఎన్నో పథకాలను ఏర్పాటు చేసిందని అదే కోవలో కేంద్ర ప్రభుత్వం కూడ నిధులు మంజూరు చేసి వారి అభివృద్ధికి మరింత చేయూతను కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదని ఆయన అన్నారు. అభివృద్ధి సంక్షేమం అని బోర్డును ఏర్పాటు చేసి గిరిజనుల కోసం, వారి బాగోగులు కోసం తనను బోర్డుమెంబరుగా ఏర్పాటు చేసిందని, ముఖ్యంగా రామయ్యపాళెంలో గిరిజన ప్రజలు అభివృద్ధిపథంలో నడిపించేందుకు వైసిపి నాయకులు, జిల్లా రైతుసల హామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వారి పట్ల చూపిస్తున్న అభిమానానికి నిరంతరం కృతజ్ఞతతో ఉంటానని, గిరిజనులు అంటే పంజం కుటుంబానికి ఎనలేని అభిమానం అని, గిరినుల మాట వింటే పంజం సుకుమార్‌రెడ్డి చేసిన సేవ మరువరానిదని ఆయన అభినందనీయులని నరసింహా అన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రైల్వేకోడూరు నియోజకవర్గంలో గిరిజనులు అంచలంచెలుగా ఎదిగారని, రానున్న రోజుల్లో వారి బిడ్డలు కూడ ఉన్నత స్థాయికి చేరేవిధంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసిందని, అందుకు నిదర్శనమే అభివృద్ధి సంక్షేమం బోర్డుమెంబరుగా రాష్ట్రమంతా పర్యటిస్తున్నానని అన్నారు. గ్రామీణ ప్రాంతా గిరిజనులు చూపిస్తున్న ప్రేమాభిమానాలు మరువరానివని మరొకమారు రామయ్యపాళెంకు చెందిన గిరిజనుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రత్యేక ప్రణాళికతో అంచలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ అధికారి, తహశిల్దారు రామ్మోహన్, జడ్‌పిటిపి పాలెంకోట రత్నమ్మ, శెట్టిగుంట బిసి నాయకులు దొమ్మర గోపాల్, ఆర్ఐ హేమంత్, రామయ్యపాళెం గిరిజనులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర అభివృద్ధి సంక్షేమం మెంబర్ నరసింహాను, సుకుమార్ రెడ్డిలను గిరిజనులు ఘనంగా సన్మానించారు.

పేదలకు అండగా నిలిచే జగనన్న ప్రభుత్వం

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



ఒంటిమిట్ట, ఆగస్టు7, ప్రభాతవార్త :

ఇది మీ ప్రభుత్వం మీకుఅండాగా నిలిచే జగనన్న ప్రభుత్వం మీకు ఈ మూడేళ్ళలలో కలిగిన లబ్దిని ఒక్కసారి గుర్తు చేస్తున్నామని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి తెలిపారు.ఆదివారం మండలంలోని చింతరాజుపల్లి నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మీ పెద్ద మనుస్సుతో జగనన్నను ఆశీర్వదించండి అని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఏ గడప ఎక్కినా ఏ ఆడపడుచును పలకరించిన తమ కు తమ బిడ్డ తమ ఆన్న సియం జగన్ వల్ల ఎంతో లబ్ది పోందామని మళ్ళి మళ్ళి ఆయనే మాకు సియంగా కావాలని ఎమ్మెల్యే మీరే రావాలని చింతరాజుపల్లి ప్రజలు ఆకాంక్షించారు. ప్రభుత్వం ఈ మూడెళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు మన ప్రభుత్వం వచ్చాక కలిగే మేలును వారికి వివరించి ప్రభుత్వం పని తీరు గురించి వారిని ఆడుగగా తమకు జగన్ ప్రభుత్వం వచ్చాక చాలా మేలు జరుగుతుందని ఎమ్మెల్యేకు ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపిపి గడ్డం జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర డైరక్టర్ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి,రాష్ట్ర డైరక్టర్ ఆరుణకుమారి, సర్పంచి నాగమ్మ,మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, వెంకటరమణ,యర్రయ్యనాయుడు తహసిల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపిడిఓ కుమర రంగయ్య , మండల ఆధికారులు, ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ

కడప, ఆగస్టు 7 ప్రభాతవార్త :

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్ నుండి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిలా చేనేత, జౌళిశాఖ అధికారి వి.భీమయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి పిలుపు మేరకు 2015 సంవత్సరం నుంచి జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నామని, కేంద్ర, రాష్ట్రాలు చేనేత రంగానికి చేయూత నిస్తున్నాయని నేతన్నలు ఆర్థికాభివృద్ధి చెందేందకు మరింత ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో డిఎంఓ వరప్రసాద్, చేనేత ఐక్యవేదిక ప్రతినిధి అవ్వారు మల్లికార్జున, చేనేత సంఘ అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆపో ఏర్పాటు చేసిన పోటో ఎగ్జిబిషన్‌ను కడప కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతన్న ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకొని మరింత ఆర్థికాభివృద్ధి చెందాలని కోరారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను సత్కరించారు.

నేతన్నల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : జె.సి. తమీమ్ అన్సారీయా

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ

రాయచోటి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

ఎనిమిదవ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం చేనేత కార్మికుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాయచోటి పట్టణంలోని బంగ్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో 8వ జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని చేనేత వాక్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ నేతన్నల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. మన అస్తిత్వానికి అసలైన గుర్తింపు నిచ్చే చేనేత వస్త్రాలను దరిద్దాం అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ స్ఫూర్తితో నేతన్నలకు మరింత ప్రోత్సాహం ఇద్దామన్నారు. చేనేత వృత్తిని ప్రోత్సహించటానికి వివిధ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఆప్కోను ప్రవేశపెట్టిందన్నారు. నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి విక్రయిస్తుందన్నారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గాల ఆధునీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చేనేత కార్మికునికి రూ.24 వేలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలను ఆదుకోవాలన్నారు. ఈ ర్యాలీలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ర్యాలీలో చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి పి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, చేనేత సంఘాల ప్రతినిధులు, నాయకులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అంత ముందు బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కమిటీలు ఏర్పాటు చేసి నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్

రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులకు ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాడని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. నేతల కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం 24 వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందని, అందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి కృతజ్ఞత చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో చేనేత కార్మికులందరికీ న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసి తద్వారా అందరికీ లబ్ధి చేకూరి విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విన్నవించుకున్నారు. రాయచోటిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది చేనేత కార్మికులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాయచోటి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ చేనేతలకు అండగా నిలబడిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తగుటవీర క్షత్రియుల అభివృద్ధి కోసం , చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మోడం వీరాంజనేయ ప్రసాద్ ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో తొగటవీర క్షత్రియ సంఘం రాయలసీమ అధ్యక్షుడు వెంకటరత్నం , సోమశేఖర్, పలు ప్రాంతాల నుంచి హాజరైన చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఆదీ..! ప్రజలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తావ్?

- కుక్కలు చింపిన విస్తరిలా దేవగుడి కుటుంబం

- అబ్బాయి ఒక పార్టీలో.. బాబాయ్ మరో పార్టీలో

- మాజీ మంత్రి ఆదిపై వైసీపీ నేతల ధ్వజం

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

అబ్బాయి ఒక పార్టీలో.. బాబాయ్ మరో పార్టీలో ఉంటూ జమ్మలమడుగు ప్రజలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని వైసీపీ చేనేత విభాగం నాయకుడు బడిగించల చంద్రమౌళి మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిని సూటిగా ప్రశ్నించారు. స్థానిక వసీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మీ, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శీనులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదినారాయణరెడ్డి వైసీపీలో కొన్నాల్లు, తెదేపాలో మరికొన్నాళ్లు ఉన్నారని, ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్న ఈయన రేపు ఏ పార్టీలో ఉంటాడో ఎవరికి తెలియదని బడిగించల అన్నారు. ఇసుక దొంగలు ఎవరన్నది జమ్మలమడుగు ప్రాంతంలో చిన్న పిల్లలను అడిగినా చెబుతారన్నారు. ఆదినారాయణంరెడ్డి తమ వెంట్రుకలు ఎవరూ పీకలేరని పదే పదే చెబుతున్నారని.. వాస్తవానికి 2019లోనే ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించిగుండు చేశారని, ఇంకా పెరకడానికి ఆయనకు వెంట్రుకలే లేవన్న సంగతి మరిచిపోయారని ఆయన ఎద్దేవా చేశారు.

మోదీ లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రధాని మోదీ ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పెడితే ఆది దానిని కూడా తన సొంత డబ్బా కొట్టుకోవడానికి ఉపయోగించుకుంటున్నాడని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శ్రీను విమర్శించారు. అభివృద్ధి గురించి ఆది మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, ఒక్క సారి పాఠశాలలు, ఆసుపత్రులు, జగనన్న కాలనీలకు వెళ్తే జగన్ చేసిన అభివృద్ధి ఏంటో స్పష్టంగా తెలుస్తుందని ఆయన సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పల్లె ముంగిటకే పాలనను తతీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదని ఆయన గుర్తు చేశారు. ఆది వెంట్రుకలు పీకాల్సిన పని తమకు లేదని, ఆ పని ప్రజలే చేసి చూపించారని మార్బుల్ శ్రీను వ్యంగ్యాస్త్రాలు వదిలారు. ఈ కార్యక్రమంలో ఆకుల బాబా, తదితరులు పాల్గొన్నారు.

75 ఏళ్ళ స్వాతంత్ర్య భారతావనిని స్మరించుకున్న బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీని ప్రారంభించిన జెసి తమీమ్ అన్సారీయా

రాయచోటి, ఆగస్టు 7, ప్రభాతవార్త :

స్వాతంత్ర్య స్ఫూర్తి భావితరాలకు అందివ్వాలన్నదే ఆజాదీ కా మహోత్సవ్ వేడుకలు ముఖ్య ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా అన్నారు. ఆదివారం ఆజాదీ కా మహోత్సవ్ వేడుకలలో భాగంగా కలెక్టరేట్ సముదాయంలో బైక్ ర్యాలీని జాయింట్ కలెక్టర్ జాతీయ జెండా ఊపి అట్టహాసంగా ప్రారంభించారు. బైక్ ర్యాలీ కలెక్టరేట్ సముదాయము నుండి ప్రారంభమై కడప రోడ్డు, లక్కిరెడ్డిపల్లి రింగ్ రోడ్డు కూడలి, ఆర్టీసీ బస్టాండ్, నేతాజీ, తాన, మాసాపేట, సాయి ఇంజనీరింగ్ కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది.

విభిన్న రీతిలో ఆజాదికా మహోత్సవ్ వేడుకలు :

75 ఏళ్ల స్వాతంత్ర్య భారతావని స్మరించుకుంటూ ఆజాదీ కా మహోత్సవ్ వేడుకలలో భాగంగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో విభిన్న రీతిలో పౌరుల్లో దేశభక్తి భావనలను మరింత ఉత్తేజపరిచేందుకు నిర్వహించారు. ర్యాలీ మార్గంలో త్రివర్ణపతాకాలు రెపరెపలాడగా, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తమ బైక్‌లకు త్రివర్ణ పతాకాలను తగిలించుకుని ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. దీంతో జిల్లాలో ముందుగానే పండ్రాగస్టు సందడి నెలకొంది. జాతీయ జెండాతో బైక్ ర్యాలీలో దేశభక్తి ఉప్పొంగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద త్రివర్ణ పతాకాలను ఎగురవేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారన్నారు.

యువత మాదకద్రవ్యాల మత్తులో పడవద్దు : డిఎస్పీ

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

కడప జిల్లా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు పోస్టరును జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాలను నిరోధించడానికి ప్రత్యేక కేంద్రీకరణతో పోలీసు యంత్రాంగం పని చేస్తోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్న యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమాలను నిర్వహించడం మంచి పరిణామమన్నారు. పోలీసు శాఖ వారు కూడా ఇటువంటి కార్యక్రమాలకు సహకరిస్తామని పేర్కొన్నారు. యువత మత్తుకు బానిస కాకూడదని అయితే వారి జీవితం నాశనం అవుతుందని ఆయన హెచ్చరించారు. ఈ అవగాహన పోస్టర్ విడుదల కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ నాయకులు ప్రసాద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

11వ తేది నుంచి భాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆజాదిక అమృత్ మహోత్సవ్ వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

భారతదేశ 75వ స్వాతంత్ర్య సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బాషా అథ్లేటిక్స్ ఫౌండేషన్, ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు పలుపోటీలు నిర్వహిస్తున్నామని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు ఎవరైనా ఈపోటీలలో పాల్గొనవచ్చునని అధ్యక్షుడు మహబూబ్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు.

వేదిక :- జార్జ్ కారోనేషన్ క్లబ్ ప్రొద్దుటూరు

నిర్వహించు పోటీల వివరాలు: గురువారం వ్యాసరచన పోటీ:- దేశ స్వాతంత్ర పోరాటంలో ఆంధ్రుల పాత్ర. వ్యాసరచన పోటీలో ప్రతి ఉన్నత పాఠశాల తరపున తెలుగుభాషలో, ఆంగ్ల భాషలో 3విద్యార్థులు 3విద్యార్థినులు చొప్పున పాల్గొనవచ్చు. దేశభక్తి పాటలు: ప్రతి ఉన్నత పాఠశాల నుండి 3 విద్యార్థులు 3 విద్యార్థినులు పాల్గొనవచ్చును. చిత్రం లేఖనం: నిర్వాహకులు ఇచ్చే చిత్రాన్ని చిత్రించాలి. శుక్రవారం వక్తృత్వపు పోటీ: 75 ఏళ్లలో భారతదేశం సాధించిన ప్రగతి. వక్తృత్వపు పోటీలో ప్రతి ఉన్నత పాఠశాల తరపున తెలుగుభాషలో, ఆంగ్ల భాషలో 3 విద్యార్థులు 3 విద్యార్థినులు చొప్పున పాల్గొనవచ్చు. ప్రతి ఉన్నత పాఠశాలనుండి ఎందరైనను పాల్గొన వచ్చును. పరిమితి లేదు. 5. బహుమతి ప్రధానం ఆదివారం సా.5గం. జార్జ్ కారోనేషన్ క్లబ్‌లో అందజేస్తారు.

చేనేత వస్త్రాలపై జిఎస్టీని తక్షణం రద్దు చేయాలి

ప్రొద్దుటూరు చేనేతల ఐక్యవేదిక డిమాండ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత వస్త్రాలపై జీఎస్టీ వర్తింపును తక్షణమే రద్దు చేయాలని ప్రొద్దుటూరు చేనేతల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు ఆదివారం 8 వ జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా ప్రొద్దుటూరు చేనేతల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎరుకలయ ఆశ్రమం నుండి గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతలను గుర్తించి జాతీయ చేనేతల దినోత్సవం ప్రకటించిన కేంద్ర ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. కానీ అదే చేనేతలు నేస్తున్న వస్త్రాలపై జిఎస్టి వర్తింపు చేయడం సరికాదన్నారు. కేవలం గుంత మొగ్గాలకే రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 24 వేల ఆర్థిక సహాయం చేస్తుందని అయినా నేతరణలకు అది గిట్టుబాటుగా లేకపోవడంతో మరమగ్గాలు ఏర్పాటు చేసుకుంటున్నారు అన్నారు. మర్మకాల వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరమగ్గాల చేనేతలకు కూడా ఆర్థిక సహాయం అందించాలన్నారు. జాతీయ జెండాలో రాత్నము పొంది ప్రచారంటే మహాత్మా గాంధీ ఆనాడే చేనేతల గౌరవాన్ని గుర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వద్ది నరసింహులు కడప జిల్లా పద్మశాలియ సంఘం అధ్యక్షులు చెన్న వెంకట కృష్ణ తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపం కార్యదర్శి పల్లా శేషయ్య. బండారు రఘురామయ్య, బండారు సూర్యనారాయణ, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహారావు, దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉట్టి శయనం, తొగట వీర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవి, కౌన్సిలర్ అనిల్ కుమార్, నందం రత్నకుమార్, వద్ది బాలుడు, మేరువమూర్తి మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు, డీలర్ ఆంజనేయులు పల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులము కాదు సేవకులమై ప్రజల ముందుకు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 7

ప్రభాతవార్త :

రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టి మూడేళ్లు గడిచిన సంతృప్తి చెందని ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కారమై గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఇంటి తలుపు తట్టి వారి సమస్యల పరిష్కారానికి కృషికి 50 రోజులు పూర్తయిన సందర్భంగా ధరించిన ప్రభుత్వ అధికారులకు సచివాలయ సిబ్బందికి వాలంటీర్లకు వైసిపి నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఉదయం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రొద్దుటూరులో ప్రారంభించి 50 రోజులు పుట్టిన సందర్భంగా 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు జరుపుకున్న సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా 50 రోజులు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా మరొకసారి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అలాగే నేడు 8వ జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు రైతన్న ప్రాణం కాపాడితే నేతన్న మానం కాపాడుతున్నాడని ఆయన కొనియాడారు అలాంటి నేతలను బతికించుకోవాల్సిన అవసరం ఉందన్నారు అందుకే ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం 24 వేల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమనపల్లి లక్ష్మీదేవి నాగరాజు వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పోరెడ్డి నరసింహారెడ్డి వరికూటి ఓబులరెడ్డి జింక విజయలక్ష్మి కామిశెట్టి బాబు మీగడ చంద్రశేఖర రెడ్డి కొండా ధన లక్ష్మి రాయపరెడ్డి ఉట్టి నాగశయనం, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 7

ప్రభాతవార్త :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం హర్ ఘర్ తిరంగ కార్యక్రమములో భాగంగా ఆగస్ట్ 14మరియు 15వ తేదీన ఇంటి ఇంటికి జాతీయ పతాకము ఎగర వేయుటకు అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం నుండి గాంధీ రోడ్ నందు జెండాలతో ర్యాలీ కొనసాగింది ఈ సందర్భంగా జై భారత్ మేరా ఇండియా అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమము లో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మి దేవి నాగరాజు, కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ సయ్యద్ షా హుస్సేన్ వలి వర్ధంతి వేడుకలు

పూల సమర్పించిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఆయిల్‌మిల్ ఖాజా,

ప్రొద్దుటూరు, ఆగస్టు 7

ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పట్టణంలో వెలసిన హజరత్ సయ్యద్ షా హుస్సేన్ వలి సాహెబ్ 453 వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మున్సిపల్ వైస్ చైర్మన్ సిఎస్ ఖాజా మొహిద్దిన్ వైయస్ మహమ్మద్ గౌస్ మురళీధర్ రెడ్డిలు భక్తిశ్రద్ధలతో గంధం ,పూల చాదర్ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనారిటీ యువ నాయకులు కార్యకర్తలు స్వామి వారి భక్తులు పాల్గొన్నారు.

విద్యారంగం పట్ల ప్రభుత్వం ఒంటెత్తుపోకడలు మానుకోవాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్

బద్వేలు అర్బన్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల సంస్కరణ అమలు పేరుతో ఒంటెద్దు పోకడలను అమలు చేస్తూ విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. ఆదివారం ఉదయం బద్వేలు లోని స్థానిక ఎన్జీవో కార్యాలయంలో యుటిఎఫ్ గోపవరం మండల ప్రధాన కార్యదర్శి సి.కంచిరెడ్డి అధ్యక్షతన జరిగిన యుటిఎఫ్ బద్వేలు ప్రాంతీయ సమావేశానికి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్యారంగం పట్ల ప్రభుత్వ నియంతృత్వ వైఖరి ఫలితంగా పేద,బడుగు,బలహీన వర్గాలకు విద్య దూరమవుతుందని ఇదే విధానం కొనసాగిస్తే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగంలో సంక్షోభం ఏర్పడి నిరక్షరాస్యత మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు వాపోయారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని ముక్కలు చెక్కలు చేసి ఆంధ్రప్రదేశ్ లో విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి వేయడం వలన భవిష్యత్తులో ప్రాథమిక విద్య కనుమరుగవుతుందని తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఉపాధ్యాయులను కూడగట్టి ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిస్టఫర్, ట్రెజరర్ రామచంద్రయ్య, బద్వేల్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి, ట్రెజరర్ గురయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు గౌస్ భాష, లాజరయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష

ప్రొద్దుటూరు, ఆగస్టు 7

ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో నీ 13వ వార్డు శివాలయం రెండు నుండి శ్రీరాముల పేట వీధిలోకి వచ్చే మెయిన్ రోడ్‌లో మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష ఆదివారం ఫోన్ ద్వారా మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు చేశారు. వార్డులోని సచివాలయ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు చెప్పిన దుకాణ యజమాని లెక్కచేయకపోవడంతో కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష నేరుగా రంగంలోకి దిగారు. మున్సిపల్ కాలువపై మెట్లు నిర్మించడమే కాక షాప్ బోర్డు ఏర్పాటు కోసం బిల్డింగు దాటి నాలుగడుగులు ముందుకు వచ్చి రోడ్డులో భారీ నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. శివాలయం వీధిలో రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండటమే కాక భవిష్యత్తులో ప్రమాదాలు కూడా కారణమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై సదరు షాపు యజమానితో మాట్లాడినా ఫలితం లేకపోగా మున్సిపల్ కమిషనర్ రమణయ్య కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు సానుకూలంగా స్పందించిన కమిషనర్ ప్రజలకు అసౌకర్యం కలిగించే నిర్మాణాల తొలగింపుకు కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చర్యలు తీసుకునే నిమిత్తం సచివాలయ ఉద్యోగులు కూడా అక్కడికి హాజరయ్యారు.

నీట్ లాంగ్ టర్మ్ అవగాహన సదస్సు

- శ్రీచైతన్య గోశాల అకాడమిక్ డీన్స్

కడప వైద్య విభాగం, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

కడప నగరంలోని ఎర్రముక్కపల్లె వద్ద గల మానస ఇన్‌లో నీట్ లాంగ్ టర్మ్ అవగాహన సదస్సును విజయవాడ గోశాల అకాడమిక్ ఎగ్జిక్యూటీవ్ డీన్ వై.మోహన్‌రావు, కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటీవ్ డీన్ గోశాల గర్ల్స్ కె.రవీంద్రకుమార్, ఎగ్జిక్యూటీవ్ గోశాల బాయ్స్ సిహెచ్‌వి.సాయిప్రసాద్, ప్రిన్సిపల్ గోశాల ఆధ్వర్యంలో నీట్ 2022 ఫలితాల విశ్లేషణ నీట్ 2023 లాంగ్ టర్మ్ కోచింగ్ పట్ల అవగాహన టాప్ మెడికల్ కాలేజీ సీట్లు పొందుటకు శ్రీచైతన్య విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్‌లో నిర్వహించే ఎగ్జామ్స్ యూనిట్ టెస్ట్ గ్రాండ్ టెస్ట్, మాడ్యూల్ టెస్టులకు సంబంధించి విశ్లేషణ మైక్రో అనాలసిస్ ఆలిండియా లెవెల్‌లో సీటు పొందడం ఎలా స్టేట్ లెవెల్‌లో టాప్ మోస్ట్ కాలేజీల్లో సీటు పొందడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పిల్లలు వారి తల్లిదండ్రులు, కడప శ్రీచైతన్య గ్రూప్ స్కూల్స్ ఏజీఎం డి.రమణయ్య, శ్రీచైతన్య గ్రూప్ కాలేజీ ప్రిన్సిపల్స్ నాగరాజు, పరమేశ్వర్‌రెడ్డి, అడ్మిన్ ఆఫీసర్లు మనోజ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున స్వామి, వైస్ ప్రిన్సిపల్ రాజా, శివప్రసాద్‌లు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:

మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక బోనాలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ ఈవో రవీంద్రరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అనంతరం చెల్లి వంశీయులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సురేంద్ర, గంగన్న, ఆలయ సిబ్బంది నారాయణ, నాగేశ్వరమ్మ, మార్కెండేయ, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శ్రీఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం, ఎద్దుల బండలాగుడు పోటీలు ఆదివారం నిర్వహించడం జరిగింది. ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో జమ్మలమడుగు తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

మోరగుడి గ్రామంలో సోమవారం ఉదయం పెద్దమ్మ గుడి వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ కార్యాలయం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలతో చర్చిస్తారని పేర్కొన్నారు.

హైవే రోడ్డు సమస్యను పరిష్కరించిన తహశీల్దార్

కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి, అంగళ్ళు హైవే రోడ్డు సమస్యను ఆదివారం తహశీల్దార్ భీమేశ్వర్‌రావు పరిష్కరించారు. హైవేరోడ్డుకు మట్లివారిపల్లె గ్రామ సర్వేనెంబర్ 833/1బి, 833/2లో విస్తీర్ణం 91సెంట్ల భూమి అవసరమని భూసేకరణలో ప్రభుత్వం చేపట్టింది. ఈభూమికి నష్టపరిహారం తక్కువ ఇవ్వడంతో రోడ్డు పనులను రైతులు అడ్డుకొన్నారు. పలుమార్లు అధికారులు రైతులతో చర్చలు జరిపినా ఫలితం కనపడలేదు. తహశీల్దార్ భీమేశ్వర్‌రావు హైవే ఇంజనీరింగ్ అధికారులు రైతులతో చర్చించి సమస్యలను పరిష్కరించడంతో రోడ్డు పనులను ప్రారంభించారు.

కార్మికుల పక్షపాతి సీఎం వైఎస్.జగన్..

- వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గౌతంరెడ్డి

కడప కార్పొరేషన్, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించి, కాంట్రాక్టు కార్మికులు, ఇతర కార్మికుల వేతనాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెంచారని వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. ఎన్ఏసీ ఎంప్లాయిస్ యూనియన్ సొసైటీ రిజిస్ట్రేషన్ జగన్ ప్రభుత్వంలో పూర్తి అవడం జరిగిందన్నారు. నేషణల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం జిల్లా పరిషత్ సభాభవనంలో జరిగింది. అభినందన సభకు ముఖ్య అతిథులుగా నూనూరు గౌతంరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డిలు హాజరై ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగులకు వేతనాలు పెంచడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం జరిగిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు, సంఘ మిత్రులకు జీతాలు ప్రభుత్వం పెంచినట్లు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రవేశపెట్టి ప్రభుత్వం నేరుగా జీతాలు కార్మికుల ఖాతాలలో వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ డి.కిరణ్‌కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు డీటీ రాజు బాబు, పి.జయలక్ష్మి, ఎస్.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు ఎస్.మునియప్ప, ఎన్.రాజబాబు, ఎస్.షాకీర్, అహ్మద్, ప్రసాద్, ఎన్.రవిచంద్ర, వైఎస్ఆర్‌టీయూసీ నగర అధ్యక్షులు మల్లూరు జాషువా, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ముందడుగు వేయాలి..

కడప వైద్య విభాగం, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

విజయవాడ రాయల్ ఇన్ ఫంక్షన్ హాలులో ముస్లిం ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. 7 జిల్లాల నుంచి ప్రముఖులు విచ్చేయడం జరిగింది. విజయవాడ, గుంటూరు, తెనాలి, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు. కడప నుంచి విచ్చేసిన సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ ఐకమత్యంగా ముందడుగు వేయాలన్నారు. అలాగే ఐక్యవేదిక ముస్లిం సోదరులకు 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికలకు ఒక ఆయుధం లాంటిదని తెలిపారు. ముస్లింలు ప్రతి ఒక్కరూ ఐక్యవేదికలో భాగస్వామి కావాలని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం సోదరులకు గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దుల్హన్ పథకం విదేశీ విద్య మరియు మైనార్టీ ఫైనాన్స్ లోన్లు ముస్లింలకు అందడం లేదని మండిపడ్డారు. ఈ విషయంపై మనమంతా ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలిపారు. ముస్లిం సోదరులకు మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం..

జమ్మలమడుగు, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన దీక్షలో ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు విజయరాణి మాదిగ, కవి రచయిత పుట్టా ఓబులేసు పాల్గొని ప్రసంగించారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే 2 తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ అమలవుతోందన్నారు. మందకృష్ణ మాదిగ డిమాండ్‌తో 2004 ఆగస్టు 7న ట్యాంక్‌బండ్‌పై గుండె జబ్బు గల పిల్లలతో చేయించిన ఉద్యమంతోనే అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్‌నియోజకవర్గ అధ్యక్షులు బాల ఓబయ్య, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు చిన్నయ్య మాదిగ, జిల్లా నాయకులు మాదిగ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చంద్రకుమార్, జమ్మలమడుగు మండలం అధ్యక్షులు పుల్లన్న, కోటా రాముడు, గురుశేఖర్, నారాయణ, పుల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు, ఆగస్టు 7,

ప్రభాతవార్త:

జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.మూలే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఎద్దులకు బండ లాగుడు పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

హజరత్ షా హుస్సేన్ వలి 453వ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు పట్టణం మెయిన్ బజార్‌లో వెలసిన హజరత్ సయ్యద్ షా హుస్సేన్ వలి వర్ధంతి వేడుకలలో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్ర సాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా మొహరం పండుగ 8వ రోజున హజరత్ సయ్యద్ షావుసేన్ వలి వర్ధంతి వేడుకలను ఎంతో పవిత్రంగా నిర్వహిస్తారు. సౌ హుస్సేన్ వలి దర్గా పీఠా ధిపతులు చేసిన ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పాల్గొని గంధము మరియు పూల చద్దర్‌ను అందజేసి వారి ఆశీర్వచనాలు పొందారు ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు అక్రమ్ మహమ్మద్ గౌస్ 26వ వార్డు వైసిపి ఇంచార్జ్ పాలగిరి ఖాజా మరియు వైసీపీ ముస్లిం మైనారిటీ నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో జీవిఐసి విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గోల్డన్‌వ్యాలీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఆజాదీక అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కురబలకోట హైస్కూల్‌లో జరిగిన ఈవిద్యార్థులు ప్రతిభ కనపరిచారని గోల్డన్‌వ్యాలీ విద్యాసంస్థల అధినేత ఎన్‌వి.రమణారెడ్డి తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులు కాస్వీ, రెడ్డిఉత్తేజ్, మహమ్మద్ ముదాసీర్‌లు మొదటిస్థానంలో నిలిచారని ఆయన తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను జివిఐసి రమణారెడ్డి, ప్రిన్సిపాల్ కెవి.రమణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న ప్రైవేటు బస్సు

ఒకరు మృతి - ముగ్గురికి గాయాలు

మదనపల్లెక్రైం, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మదనపల్లె-బెంగుళూరు రోడ్డు, కర్నాటక సరిహద్దు చెక్‌పోస్టు సమీపంలోని అటవీప్రాంతంలో శనివారం అర్ధరాత్రి ప్రైవేటు బస్సు, ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన జవర్ ముని(45) అక్కడిక్కడే మృతిచెందాడు. ఇందులో ముగ్గురు గాయపడ్డారు. రాయల్పాడు పోలీసులకథనం మేరకు వివరాలిలావున్నాయి. బీహార్‌కు చెందిన జవహార్ మని, దీన్‌దయాల్‌కుమార్(20), గోబీష్‌కుమార్(17), రాజేష్ ముని(24)లు చీకలుబైలు వద్ద ఇటుకలు తయారి చేస్తున్నారు. రాయల్పాడు నుంచి ట్రాక్టర్‌లో కట్టెలు తీసుక

పెద్ద చెరువు వద్ద వ్యర్థాలు తొలగింపు

బద్వేలు, ఆగష్టు 07 ప్రభాతవార్త :

పునీత్ సాగర్ కార్యక్రమంలో భాగంగా శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సిసి, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ గర్ల్స్, బాయ్స్ క్యాడెట్స్ పెద్ద చెరువు నందు వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో పాల్గొని పెద్ద చెరువు సమీపంలో ఉన్న చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను దాదాపు 1 కిలోమీటరు వరకు తొలగించి పరిశుభ్రం చేయడం జరిగిందని కళాశాల పరిపాలన అధికారి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, మున్సిపల్ కమీషనర్ కృష్ణా రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న చెరువుల సమీపంలో చెత్తా చెదారం తొలగించి నీరు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. తద్వారా మనకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. అలాగే అనంతరాజపురం, లక్ష్మీపాలెం గ్రామాలలో వ్యర్థాలను తొలగించే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కళాశాల ఎన్‌సిసి ఏఎన్‌వోస్ లెఫ్టినెంట్ బాల ఓబులేసు, సబ్ లెఫ్టినెంట్ సుధాకర్‌రెడ్డి, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్లకు ప్రార్థనలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం వై.కోట గ్రామంలో వెలసిన చావిడి వద్ద పీర్లకు సర్పంచి మల్లెం ఈశ్వరయ్య, ఎంపీటీసీ మణి, దేశయ్య, గ్రామస్థులు మొహర్రం సందర్భంగా ప్రార్థనలు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సాంప్రదాయ బద్ధంగా వస్తున్న పీర్లకు హిందూ ముస్లిం సోదరులు ఎంతో ఐకమత్యంతో భక్తి శ్రద్ధలతో పీర్ల స్వాములకు ప్రార్థనలు చేశారు.

అంగన్‌వాడీ వర్కర్స్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఓబులవారిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధం సంబంధించిన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా రాధాకుమారి, ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, బేబీ, మునెమ్మ, బి.వాణిలను సహాయ కార్యదర్శులుగా శ్యామలా, సురేఖ, పి.సుశీల, శాంతి, కోశాధికారులుగా తదితర సభ్యులను 25 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదిక అమృత్ దినోత్సవం

చిట్వేలిలో భారీ ర్యాలీ

చిట్వేలి, ఆగస్టు 7 ప్రభాతవార్త

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకొంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆజాదిక అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఆదివారం చిట్వేలిలో ఘనంగా జరిగింది. తహశిల్దారు మురళీకృష్ణ, ఎంపిడిఓ మోహన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కెకె వడ్డిపల్లె మూలరోడ్డు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ రాపూరు-కోడూరు అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో చిట్వేలి హైస్కూల్ ఎన్‌సిసి విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, పంచాయతి కార్యదర్శులు, విఆర్ఒలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్య వాయువులను పేల్చడానికి దోహదపడిన స్వాతంత్ర్య సమర యోధులను గుర్తు చేసుకోవడమేగాకుండా జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యను స్మరించుకోవడం ఈ ర్యాలీ ప్రత్యేకతగా కనిపించింది. ప్రధాని మోడి ఆకాంక్ష మేరకు దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం విశిష్టత ప్రతిఒక్కరికి తెలియాలన్న ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి చిట్వేలి మండలంలో మంచి ప్రచారమే లభించింది. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తహశిల్దారు, ఎంపిడిఒ, ఎస్ఐ మాట్లాడారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలను బలోపేతం చేద్దాం - ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందుదాం

రాయచోటి, ఆగస్టు 7 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ)ని బలోపేతం చేయాలని వైఎస్సార్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎపిజిఈఎ అధ్యక్షులు ఎం. రమేష్ కుమార్, వి. శివయ్య, యర్రపురెడ్డి, శ్రీనివాసులు రెడ్డిలు కోరారు. ఆదివారం డైట్ ఆవరణంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా కార్యవర్గ ఎన్నిక ముందస్తు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగులను ఉద్దేశించి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంఘం పదవులకు కోసం కాకుండా ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేయాలనే ఆలోచనలతో అందరం కలసి పని చేద్దామన్నారు. ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎపి డిఎస్సీ కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఉద్యోగాల సంఘాలు బతోపేతం కావాలని, ఉద్యోగ సమస్యలు పరిష్కారానికి, సిపిఎస్ రద్దుకు, కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి కృషి చేయాలని, ఏఎన్ఎం బదిలీల విషయంలో వారికి ఆమోదయోగ్యమైన విధానం పాటించాలని, మూడు జిల్లాల అధ్యక్షులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పాల సుధాకర్ రాజు, గురుప్రసాద్, కరీముల్లా, సాదిక్, ఆర్. నారాయణ, ఎం.సిద్దయ్య నాయుడు, బడిశెట్టి బాలాజీ, నాగప్రసాద్, సాయికుమార్ తదిత రులు పాల్గొన్నారు.

150 లీటర్ల సారా ఊట ధ్వంసం

ములకల చెరువు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

150 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ములకలచెరువు ఎస్ఈబీ సీఐ మల్లిక తెలిపారు. ఎస్ఈబీ సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ములకల చెరువు ఎస్ఈబీ కార్యాలయం పరిధిలోని రెక్కలకుంట తాండ సమీపంలో కర్ణాటక మద్యం వండుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారాకు ఉపయోగించే 150 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ములకల చెరువు సర్కిల్ పరిధిలోని పెద్దతిప్ప సముద్రం, ములకల చెరువు, తంబళ్లపల్లె మండలాల్లో ఎవరైనా నాటు సారా తయారు చేసినా, అమ్మినా, అక్రమ మద్యం అమ్మినా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కీళ్ళు, ఎముకలపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానంద రెడ్డి

బద్వేలు అర్బన్, ఆగష్టు 07 ప్రభాతవార్త :

వయసు పైబడిన ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ కీళ్ళు, ఎముకలపై ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానందరెడ్డి అన్నారు. ఆదివారం నిర్వాణ హాస్పిటల్‌లో వివిధ రకాలుగా కీళ్ళు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పి, వెన్నెముక సమస్యలు కలిగిన సుమారు 100 మందికి ఆరోగ్యం పట్ల సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం డా॥ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ కీళ్ళ వాతం, వెన్నెముక, మోకాళ్ళ నొప్పులు, తుంటి ఎముక సమస్యలు, తుంటి కీళ్ళు, భుజం, నడుము నొప్పి, సయాటికా, మెడ నొప్పితో పాటు పలు రకాల ఆర్థోకు సంబంధించిన సమస్యలపై పలువురికి వివరించారు. ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు తగిన వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం వలన ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చన్నారు. ఎముకలకు సంబంధించిన ఏ సమస్య అయినా నిర్లక్ష్యం వహిస్తే అనేక ఇబ్బందులకు గురికావలసి వస్తుందన్నారు. ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు చేసుకోవాలని, ప్రతి రోజూ వ్యాయామం, నడక, యోగా లాంటివి క్రమం తప్పకుండా ఆచరించడం వలన అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మోకాళ్ళ సమస్యలు ఉన్నవారికి, మోకాళ్ళ నొప్పులు అధికంగా ఉన్నవారికి అధునాతన పరికరాలతో చికిత్సలు చేయడం జరుగుతుందని పలువురికి పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాణ హాస్పిటల్ డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డి, అపోలో హాస్పిటల్ మేనేజర్ రామాంజనేయరెడ్డి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ నూతన భవనానికి భూమి పూజ

దువ్వూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో పోలీసుస్టేషన్‌కు నూతన భవనాన్ని నిర్మించేందుకు ఆదివారం ఎస్సై కేసీ రాజు భూమి పూజ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్ వర్షాలు వస్తే కారుతుండడంతో జిల్లా పోలీసుశాఖపై అధికారుల ఆదేశాల మేరకు శిథిలమైన భవనాలను తొలగించి శుభ్రం చేయించి భూమి పూజ నిర్వహించారు. గతంలో పోలీసు నివాస గృహాలుగా ఉన్న స్థలంలోనే నూతన పోలీసుస్టేషన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేంద్రరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం పరిమళించిన వేళా

నందలూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని కన్యకాచెరువుపై రైతును కారు ఢీకొనడంతో అక్కడే కుప్పకూలి పడిపోయిన వ్యక్తిని ఒంటిమిట్ట మండ లం చింతరాజుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ముగించుకొని అదే రహదారిలో వస్తున్న రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి గమనించి వెంటనే కారు దిగి ప్రమాదం జరిగిన ప్రదేశానికి వచ్చి వెంటనే 108కు కాల్‌చేసి అంబులెన్స్ వచ్చేంతవరకు వేచి ఉండి డాక్టర్‌లు, పోలీసులతో మాట్లాడి ప్రథమ చికిత్స కోసం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి పంపడం జరిగింది. ఈ సన్నివేశాన్ని చూస్తున్న స్థానికులు, ప్రయాణికులు ఎమ్మెల్యే యొక్క దాతృత్వం గురించి గొప్పగా మాట్లాడుకోవడం జరిగింది. సామాన్య ప్రజలే ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని చూసి చూడనట్లు వెళ్లిపోతుంటే ఒక ఎమ్మెల్యే అయి ఉండి ఎన్నో ముఖ్యమైన కార్యక్రమాలు వదిలి వేసి అరగంటపాటు క్షతగాత్రుని వద్ద వేచి ఉండి అతని సాధక బాధకాలను పంచుకొన్న మన రాజంపేట ఎమ్మెల్యేని చూసి అందరూ శభాష్ అని కొనియాడారు.

కొండవాండ్ల పల్లిలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

రామాపురం, ఆగస్టు 7ప్రభాతవార్త:

మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్ల పల్లిలో ఆదివారం రాయచోటి టిడిపి ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో తిరిగి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం విశ్రాంత లెక్చరర్ ఈశ్వంరెడ్డి అమ్మ వర్ధంతిలో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు సహదేవరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ గౌడ్, సుభాన్ పాల్గొన్నారు.

డా॥ వివేకానంద రెడ్డి సేవలు అభినందనీయం

బద్వేలు అర్బన్, ఆగష్టు 07 ప్రభాతవార్త :

నెల్లూరు నగరంలోనే కాకుండా కడప జిల్లాలో కూడా పేద, మధ్య తరగతి ప్రజలకు అవసరమైన సమయంలో చేయూతనిచ్చే లక్ష్యంతో అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానంద రెడ్డి సేవలు అభినందనీయం అని టీ బ్యాచ్ ఫ్రెండ్స్ బ్రహ్మదేవుని యర్రంరెడ్డి, పబ్బతి చంద్ర శేఖర్, వి.వి.రమణ, గొల్లమందల వేణుగోపాల్ రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని నిర్వాణ హాస్పిటల్‌కు విచ్చేసిన అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ కీళ్ళ మార్పిడి, ఆర్థోస్కోపిక్, వెన్నెముక శస్త్ర చికిత్స నిపుణులు డా॥ వివేకానందరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, వారికి గిఫ్ట్ బాక్సు అందజేసిన టీ బ్యాచ్ ఫ్రెండ్స్ మాట్లాడుతూ గత సంవత్సరంలో భారీ వర్షాలకు అన్నమయ్య డ్యాం తెగి కొన్ని గ్రామాలు ముంపుకు గురికావడంతో వరద బాధితులకు చేయూతనిచ్చేందుకు టీ బ్యాచ్ ఫ్రెండ్స్ అందించిన సేవా కార్యక్రమాలకుగాను డా॥ వివేకానంద రెడ్డి 12 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించడంతో పాటు 2 సంవత్సరాలుగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రానికి కూడా వారి వంతు సహాయ సహకారాలు అందించడం సంతోషకరం అని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డిని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ మేనేజర్ రామాంజనేయరెడ్డి, నిర్వాణ హాస్పిటల్ సిబ్బంది చెన్నయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు మెంబర్‌కు తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లెకు చెందిన వార్డు మెంబర్ వరుణ్‌కుమార్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై వినోద్‌కుమార్ తెలిపారు. వరుణ్‌కుమార్ రామాపురం వెళ్లి తిరిగి కారులో వస్తుండగా కారు చెడిపోయి కళ్యాణ మండపం వద్ద కారు ఆపి పరిశీలిస్తుండగా లక్కిరెడ్డిపల్లె నుంచి రామాపురం వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో వరుణ్‌కు తీవ్ర గాయాలు తగిలాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

పులివెందులలో భారీ అగ్ని ప్రమాదం

పులివెందుల, ఆగస్టు 7, ప్రభాతవార్త:

పులివెందులలోని ఏపీఐఐసీ సమీపంలోని ఎన్ఎస్ఎల్ కర్మాగారంలో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఎన్ఎస్ఎల్ స్పిన్నింగ్ ఫ్యాక్టరీలోని గోడౌన్‌లో రాత్రి 11.30గంటల సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ప్రమాద విషయాన్ని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవడంతో వేంపల్లె, యూసీఐఎల్ ప్రాంతాల నుంచి కూడా ఫైరింజన్లను తెప్పించి సిబ్బంది మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఆదివారం మధ్యాహ్నం సమయానికి పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఫ్యాక్టరీ మేనేజరు నాగరాజు తెలిపారు. కొన్ని వందల మంది పనిచేస్తూ, పత్తిని నిల్వ చేసే చోట అగ్నిమాపక పరికరాలు అందుబాటులో లేకపోవడం, నిబంధనల మేరకు వ్యవహరించకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

బీజేపీ చేతిలో కీలు బొమ్మలుగా ప్రాంతీయ పార్టీలు

వేంపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త :

కేంద్రంలోని బీజేపీ చేతిలో రాష్ట్రంలోని వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కీలు బొమ్మలుగా మారాయని ఏపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాటాడారు. రాష్ట్రానికి బీజేపీ ఒక శనిగ్రహంలా తయారైందన్నారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై వైఎస్ఆర్‌సీపీ, టీడీపీలు ప్రతి అంశంలోను బీజేపీకి మద్దతిస్తున్నాయన్నారు. వైఎస్ఆర్‌సీపీ పాలనలో రాష్ట్రంలో భూమి, ఇసుక, మద్యం, మైన్స్ మాఫియా రాజ్యమేలుతోందని తులసిరెడ్డి అన్నారు. ఇటీవల ఈ కోవలోకి రేషన్ బియ్యం మాఫియా కూడా చేరిందన్నారు. ఇప్పటికైనా మాఫియాలను కట్టడి చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు, ఆగస్టు 7 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని ఆడపూరు గ్రామ పంచాయతిలో ఆదివారం మొహరం పండుగను పురస్కరించుకొని పీర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం అనేది ప్రతిఒక్కరూ జరుపుకొనే పండుగ అని, కులమతాలకతీతంగా జరుపుకొనే పండుగగా, మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకొంటారన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడపూరు వైఎస్ఆర్‌సిపి నాయకులు, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్, వైఎస్ఆర్‌సిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నడివీధి సుధాకర్, వైఎస్ఆర్‌సిపి నాయకులు తుమ్మల శ్రీధర్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లివిన్ డయాగ్నస్టిక్స్ సేవలు అభినందనీయం: డిఎస్పీ

500ల మందికి ఉచిత వైద్య సేవలు

వీరబల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త:

ఇటీవల గాలివీటి వివేకానందరెడ్డి స్థాపించిన లివిన్ డయాగ్నస్టిక్స్ సేవలు అభినందనీయమని డిఎస్పీ శ్రీధర్ కొనియాడారు. ఆదివారం వీరబల్లి మండలంలోని మట్లి పంచాయతీలో గల గ్రామ సచివాలయం నందు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని డిఎస్పీ శ్రీధర్, మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 500ల మందికి వైద్య సేవలు అందించారు. ప్రతి మనిషికి 71 రకాలకు సంబంధించిన రక్త పరీక్షలు, వైద్య సేవలు చేయడం జరిగింది. ముఖ్యంగా గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్యాన్సర్, థైరాయిడ్ వంటి జబ్బులకు ప్రత్యేకంగా వైద్యం అందించారు. ఈ వైద్య సేవలు ప్రతేక వైద్య నిపుణుల చేత పరీక్ష చేయించడం జరిగింది. మందులు, మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దివంగత నేత మాజీ జిల్లా పరిషత్ సభ్యులు గాలివీటి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఈ సేవలు అందించినట్లు లివిన్ వ్యవస్థాపకులు గాలివీటి వివేకానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్, వ్యవస్థాపక అధ్యక్షులు హరినాథరెడ్డి, సభ్యులు పాల్గొనడం జరిగింది. ఈ మెగా వైద్య శిబిరానికి మండలంలోని మట్లి, తాటి గుంటుపల్లి, ఓదివీడు పంచాయతీలలోని గ్రామాల నుండి ప్రజలు శిబిరానికి రావడం జరిగింది. అనంతరం స్థానిక సర్పంచ్, పలువురు మాట్లాడుతూ లివిన్ వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆయన సూచించారు. మిగతా దాతలు కూడా వివేకానంద రెడ్డిని ఆదర్శంగా తీసుకొని పేద ప్రజలకు సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ చిన్నబాబు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, మండల ఎస్ఐ మహమ్మద్ రఫీ, లివిన్ వైద్య సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు సత్యనారాయణరెడ్డి, విఆర్డీఎస్ ఛైర్మెన్ సురేంద్రారెడ్డి, భూసాయి నాయుడు, రమణయ్య, కనితి, వెంకటరమణ, పులి హోర కేశవులు తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న గజ్జలకుంట

అనారోగ్యాలకు గురవుతున్న పరిసర ప్రజలు

మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

పట్టణ నడిబొడ్డున ఉన్న గజ్జలకుంట చెత్తా చెదారాలతో నిండి దుర్వాసన వెదజల్లుతుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇటీవల పడ్డ వర్షాలకు గజ్జలకుంటలోకి వర్షపునీరు రావడంతో కుళ్ళిన గడ్డి, చెత్తలతో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసన వల్ల దోమల బెడద కూడా ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు కోమిటివానిచెరువులో కూడా ఎక్కువుగా చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డుపక్కనున్న ఈ రెండు కుంటల్లోనూ చెత్త పేరుకుపోవడం వల్ల రోజు రోజుకు దుర్వాసన ఎక్కువ అవుతోందని ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో క్లీన్‌అండ్‌గ్రీన్ నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇకనైనా స్పందించి గజ్జలకుంట, కోమిటివానిచెరువులో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వివాహ వేడుకలో సీఎం సతీమణి భారతి

పులివెందుల రూరల్, ఆగస్టు 7, ప్రభాతవార్త :

పులివెందులలోని విజయగార్డెన్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డు కౌన్సిలరు బండి శివలక్ష్మి, మల్లికార్జునరెడ్డి దంపతుల కుమార్తె లక్ష్మిశిల్ప వివాహం జయవర్ధన్‌రెడ్డితో జరిగింది. ఈ వివాహ వేడుకలో వైఎస్ భారతి, డాక్టర్ దినేష్‌కుమార్, పులివెందుల వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు మూలి మహేశ్వర్‌రెడ్డి, రంగ నాయకులు, పార్నపల్లె కిషోర్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త :

వేంపల్లెలోని రెడ్డెయ్య కాలనీలో జూదం ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.9100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపాల్ నాయక్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన సిబ్బందితో కలిసి అక్కడ దాడి చేయగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు.

మొహర్రం సందర్భంగా అన్నదానం

రాజంపేట అర్బన్, ఆగస్టు 7 ప్రభాతవార్త

హిందూ ముస్లింలు సమైక్యంగా నిర్వహించే పవిత్ర మొహర్రం వేడుకలు రాజంపేటలో రెండో రోజు ఘనంగా జరిగాయి. స్థానిక నాగులమాను వీధిలో పీర్లపండుగను నిర్వహించారు. గుండం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ